జోరుగా దోబీఖానా పనులు

- రూ.39 లక్షలతో జగన్నాథపురంలో నిర్మాణం
- స్థానిక రజకుల హర్షం



జగన్నాథపురంలో నిర్మిస్తున్న దోబీఖానా



గ్రౌండ్ ఫ్లోర్‌లో నిర్మించిన సిమెంట్ కుండీలు ,బల్లలు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురంలో రూ.39 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రెండంతస్తుల దోబీఖానా పనులు జోరుగా జరుగుతున్నాయి. గతంలో శ్మశానవాటిక పక్కన ఉన్న దోబీఖానా శిథిలమవడంతో రజకులు చాలా ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ చొరవతో దోబీఖానా కొత్తగా నిర్మించడానికి రూ.39 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో రెండంతస్తుల్లో భవన నిర్మాణం చేపడుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో దోబీఖానా పనులు పూర్తి కాగా.. మొదటి అంతస్తులో సామాజిక భవనం నిర్మిస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో సిమెంట్ కుండీలు, బల్లలు నిర్మించి, కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో పనులు పూర్తి కానున్నాయి. అన్ని సదుపాయాలతో దోబీఖానా అందుబాటులోకి వస్తుందని స్థానిక రజకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు

తాటిచెట్లపాలెం: వచ్చే నెలలో గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహించనున్న గిరిప్రదక్షిణ కోసం ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. గిరిప్రదక్షిణ చేసే స్టేడియం వెనుక వైపు గల రహదారులను శుభ్రం చేస్తున్నారు. రోడ్డుకిరువైపులా గల ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. జీవీఎంసీ 45వ వార్డులోని సాలగ్రామపురం, వరాహగిరి కాలనీ, సత్యసాయినగర్, సింహగిరి కాలనీ, సింగాలమ్మపురం కొండవాలు ప్రాంతాల్లో వారం రోజులుగా దారిపొడుగునా రహదారిని వెడల్పు చేస్తూ, విశాలంగా చేశారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, మేస్త్రీ సుభాని, సూపర్‌వైజర్ లీలా ప్రసాద్‌ల పర్యవేక్షణలో శానిటరీ సిబ్బంది ఈ పనుల్లో పాల్గొన్నారు.



రోడ్డును శుభ్రం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిను ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ హెల్త్, శానిటేషన్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు టీఎస్‌ఎన్ కాలనీలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలనీ వాసులకు మలేరియా, డెంగ్యూ వాధుల వ్యాప్తి, అరికట్టే విధానాలు, లక్షణాల గురించి జీవీఎంసీ సిబ్బంది వివరించారు. వారంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడే పాటిస్తూ ఇళ్లలోని నీటిని నిల్వ చేసే పాత్రలన్నింటినీ ఖాళీ చేసి శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసర ప్రాంతాల్లో నిల్వనీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు, మలేరియా సిబ్బంది, హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి



నక్కవానిపాలెం రామాలయం వీధిలో గొయ్యి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం రామాలయం వీధిలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. రాత్రి పూట స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చిన్న రోడ్డు కావడంతో వాహన చోదకులు, పాదచారులకు గొయ్యి కనిపించక ప్రమాదానికి గురవుతున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి గొయ్యికు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు అభాగ్యురాలు



పద్మను ఆమె కుమార్తెకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

అల్లిపురం: రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తున్న 60 ఏళ్ల పద్మ అనే మహిళను ఆర్పీఎఫ్, ఏయూటీడీ సిబ్బంది సంయుక్తంగా ఈ నెల 14వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. ఆమెను జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి తరలించి ఆశ్రయం కల్పించారు. ఆమె నుంచి వివరాలు సేకరించారు. ఆమెది గాజువాక దరిగంట్యాడ అని తెలియజేయడంతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు శుక్రవారం ఆమెను వ్యానులో తీసుకెళ్లి ఆమె కుమార్తెకు అప్పగించారు. ఆమె మానసిక స్థితి బాగులేదని, ఊరూరా తిరుగుతుందని పద్మ కుమార్తె తెలిపింది. ఆమెకు పింఛన్ కూడా వస్తుందని తెలియజేసింది. ఆమెను ఇల్లు కదలకుండా చూసుకోవాలని వాసు పద్మ కుమార్తెకు సూచించారు.

'జీవో 429ని అమలు చేయండి'

సీతమ్మధార: జీవో నంబర్ 429ని అమలు చేయాలని కోరుతూ ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ప్రతినిధులు శుక్రవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును కలిశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఫౌండర్ ప్రెసిడెంట్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం జోషి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స అందిస్తూ, ప్రభుత్వ నిబంధనలు అనుసరిస్తూ 50 ఏళ్లుగా ప్రజల్లో పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. నాటి ప్రభుత్వం 2008లో జీవో నంబర్ 429ని ఇచ్చి తద్వారా గుర్తింపునిస్తూ ప్రభుత్వ అనుమతులలో శిక్షణ ఇచ్చారని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రాల్లో సుమారు 95 వేల మందికి శిక్షణ ఇచ్చారని, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆ జీవోని అమలు పరచడంలో విఫలమయ్యాయన్నారు. రాష్ట్రంలో 46 వేల కుటుంబాలు ఉన్నాయని, తమకు న్యాయం జరిగేలా కృషి చేయాలని ఎమ్మెల్యేను గ్రామీణ వైద్యులు కోరారు.

రోడ్డెక్కిన మురుగు నీరు



బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డులో లీకవుతున్న మ్యాన్‌హోల్

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో మోర్ ఎదురుగా రహదారిలో యూజీడీ మ్యాన్‌హోల్ పొంగి మురుగు నీరు ప్రవహిస్తోంది. మురుగు దుర్వాసనతో స్థానికులు, పాదచారులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రోడ్డెక్కిన మురుగు నీటితో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో వారంలో ఒకసారి మ్యాన్‌హోల్స్ లీకవుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'పల్లా'ను కలిసిన ఉత్తర నాయకులు

సీతమ్మధార: గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం సందర్భంగా మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయనను టీడీపీ పార్లమెంటరీ జనరల్ సెక్రటరీ పొలమరశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వార్డు అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

సీతమ్మధార: మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం దొండపర్తి పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఆరోగ్య కేంద్రం, జీవీఎంసీ మలేరియా సిబ్బంది ప్రజలకు సూచించారు.

ఆలోచింపజేసిన కళాజాత



ప్రియదర్శిని కాలనీలో బాల్య వివాహాలు వద్దంటూ వివరిస్తున్న కళాకారులు

పెదగంట్యాడ: బాల్య వివాహాలు అనర్థాలకు మూలమని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కళాజాత కళాకారులు వివరించారు. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ సెక్టార్ పరిధిలోని ప్రియదర్శిని కాలనీ, దిబ్బపాలెం, దయాల్‌నగర్ లోవ, దయాల్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు, స్థానిక మహిళలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలల హక్కుల చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం గురించి ఆట పాటలతో వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, శెట్టి పద్మావతి, పి.బేబి, పైడిరత్నం, దేముడమ్మ, ఆయాలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. వివరాలిలా.. గురువారం రాత్రి విశాఖ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం 2లో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు గవర్నమెంట్ రైల్వే పోలీసులకు సమాచారం తెలిసింది. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్‌ఐ వి.బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని, వయసు సుమారు 50ఏ ఏళ్లు, ఎత్తు సుమారు 5.5 అడుగులు, చామనచాయ రంగులో ఉంటాడని, నీలం రంగు టీ షర్ట్, నలుపు రంగు నిక్కర్ ధరించి ఉన్నట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. మృతుడు ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్‌ఐ బాలాజీరావు కోరారు.



వ్యక్తి మృతదేహం

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



మల్లెపూలు, గులాబీల అలంకరణలో అమ్మవారు



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

అల్లిపురం : బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయదాతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని మల్లెలతో అభిషేకించారు. ప్రతి శుక్రవారం జరిగే ఈ పూజలో పాల్గొనే వారు రూ.500 చెల్లించిన యెడల ఈ పూజకు దంపతులను లేక ఇద్దరిని అనుమతిస్తామని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వి.రాంబాబు తెలిపారు. ఆసక్తి గల వారు 0891–2566514, 8985515989 నంబర్లు, వాట్సాప్ ద్వారా సేవా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

వెల్ఫేర్ బోర్డు పథకాలు కొనసాగించాలి

సీఐటీయూ డిమాండ్



మాట్లాడుతున్న విశాఖ జిల్లా అధ్యక్షురాలు అనసూయ

అల్లిపురం: భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికుల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కరోనా సమయంలో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడినప్పుడు వెల్ఫేర్ బోర్డు ద్వారా ఎటువంటి సాయం అందలేదన్నారు. వెల్ఫేర్ బోర్డులో వున్న సొమ్మును కార్మికుల సంక్షేమానికి ఖర్చు పెట్టలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.అనసూయ, పూర్వ ప్రధాన కార్యదర్శి జి.పోలేశ్వరరావు, కె.నర్సింగరావు, రమణ, లక్ష్మణ, రాజు, చంద్రరావు, సూరప్పడు అన్ని జోన్ల కార్మికులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా యంత్రాంగం, జిల్లా ఉపాధి కార్యాలయం, కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. రెండు రోజుల పాటు జరిగే ఈ మేళాను ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ప్రారంభించారు. ఈ మేళాకు తొలిరోజు శుక్రవారం 1220 మంది అభ్యర్థులు హాజరయ్యారు. టెక్ మహీంద్ర, పాత్ర కంపెనీలో 328 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.1.67 లక్షలు నుంచి రూ.2.50 లక్షలు ప్యాకేజ్ ఉంటుంది. ఈ కార్యక్రమంలో టెక్ మహీంద్ర హెచ్‌ఆర్ గీతాంజలి, జేకేసీ కో–ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వీధిలైటు వెలిగించండి

మత్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం శ్రీహర్షనగర్‌లో కొద్ది రోజులుగా వీధి లైటు వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో అంధకారం నెలకొంటోంది. చీకటిగా ఉండటం వల్ల పాదచారులు, వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు ఒంటరిగా వెళ్లాలంటే భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లైటు ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.



శ్రీహర్షనగర్‌లో వెలగని లైటు

వైభవోపేతం.. భువన విజయం



భువన విజయం సాహితీ రూపకాన్ని తిలకిస్తున్న సిద్ధేశ్వరానంద మహాస్వామి



హాజరైన భక్తులు, సాహితీప్రియులు

సీతంపేట: శ్రీకృష్ణదేవ రాయలు కాలంలో అష్టదిగ్గజాలతో భువన విజయం సభ నిర్వహించేవారని పుస్తకాల్లో చదివాం, సినిమాలలో చూసి ఉంటాం. కానీ అప్పటి రాయల వారి వైభవం, ఆహార్యం, కవుల సాహితీ ప్రతిభ, చమత్కారం చూసే భాగ్యం మనకు లేదనే చెప్పాలి. శ్రీలలితాపీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాలలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన అక్కిరాజు సుందర రామకృష్ణంరాజు బృందం ప్రదర్శించిన 'భువన విజయం సాహితీ రూపకం' అప్పటి వైభవాన్ని ప్రేక్షకుల కళ్లకు కట్టినట్టు చూపారు. సభికులను శ్రీకృష్ణదేవరాయల కాలానికి తీసుకు వెళ్లేలా రసాస్వాదనకు లోనుచేశారు.డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణరాజు ప్రధాన పాత్రలో శ్రీకృష్ణ దేవరాయలుగా అద్భుతమైన రాజసం, ఆహార్యంతో ఆకట్టుకున్నారు. అప్పాజీగా ముదిగొండ శివప్రసాద్, అల్లసాని పెద్దనగా పంచ్రప్రగడ శ్రీనివాస్, మల్లనగా భాస్కరభట్ల, అయ్యలరాజుగా కె.చంద్రశేఖరం, పింగళిసూరనగా చౌదూరి నరసింహారావు, నంది తిమ్మనగా మల్లాది వెంకట గోపాలకృష్ణ, ధూర్జటిగా యెల్లం రాజు త్యాగరాజు, భట్టుమూర్తిగా సి.యం.కె.గాంధీ, తెనాలి రామకృష్ణుడిగా మావుదూరు సూర్యనారాయణమూర్తి తమదైన శైలిలో అద్భుత ఆహార్యం, పద్య పఠనంతో అలరించారు.

ఈ సందర్భంగా అక్కిరాజు సుందర రామకృష్ణ మాట్లాడుతూ మతసామరస్యాన్ని చక్కగా పాటించి ప్రజా సంక్షేమం కోసం సుపరిపాలన అందించిన ఏకైక చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు. ఆ మహా చక్రవర్తి సాధించిన విజయాలను పక్కనపెడితే భాషాపరంగా ఆయన చేసిన కృషి ఆనాటి నుంచి ఈ నాటి వరకు ఏ రాజు, ఏ ప్రభుత్వం చెయ్యలేదనే చెప్పాలన్నారు. అష్ట దిగ్గజ పాత్రధారులు తమదైన అద్భుత ప్రతిభతో దత్తపది, సమస్య పూరణ, వర్ణనలతో సభను రక్తికట్టించారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన భువనవిజయం సాహితీ రూపకాన్ని పలువురు భక్తులు, సాహితీవేత్తలు చూసి తరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రెండు రైతుబజార్లలో పార్కింగ్ నిర్వహణకు గడువు పెంపు

మహారాణిపేట: కంచరపాలెం, గోపాలపట్నం రైతుబజార్లలోని ఖాళీ స్థలంలో పార్కింగ్ కోసం ఏడాది కాలానికి బహిరంగ వేలం నిర్వహణ ఇచ్చిన గడువును పెంచారు. జులై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వేలం కోసం తొలుత ఈ నెల 28న నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ కారణాల వల్ల ఈ గడువును జులై 5 వరకు పొడిగించారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు ధరావత్తు సొమ్మును జిల్లా జాయింట్ కలెక్టర్, రైతు బజార్లు, విశాఖపట్నం వారి పేరున డీడీని జత చేసి దరఖాస్తులను పంపాలని జిల్లా ఇన్‌జార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను శనివారం నుంచి వచ్చేనెల 5వతేదీ మధ్యాహ్నం ఒంటి గంటలలోపు అందజేయాలని, 5న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, బేస్ రేట్లు కూడా ఇవ్వడం జరిగిందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తులు, ఇతర ఫారాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్.నంబర్ 8.202/2, ఆర్‌ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, రైతుబజార్ పక్కన, విశాఖపట్నం–530029ను లేదా 90308 19082 నంబర్‌లో సంప్రదించాలి.